ఆ వినోదాన్ని చూచి ఆనందిస్తూండగా, మనం ఏదో ఘన కార్యం చెయ్యబోయి, చావు దెబ్బలుతిని, మరో వినోదాన్ని కల్పించటమెందుకు ? నువ్వొక్కడివీ వెళ్ళి ఒళ్లు హూనం చేయించుకుంటానంటే మా అభ్యంతరమేమీ లేదు. ఎందుకొచ్చిన గొడవ ? హాయిగా ఇంటి దగ్గిర మనకోసం మన గృహిణులెదురుచూస్తూవుంటారు. చల్లగా వాళ్లు అందించే చిరునవ్వులూ, కాఫీలూ ఊహించుకుంటూ పదండి ముందుకు పదండి తోసుకు !''

రాధాకృష్ణ మాటల కందరూ విరగబడి నవ్వారు. వాళ్ళతోబాటు తనూ రాక తప్పిందికాదు. ఆనాడు ఓ ఘోరం కళ్ళముందు జరుగుతూంటే, నివారించడానికి, కనీసం అదేమిటో తెలుసుకోటానికి కూడా నిరాకరించిన వీళ్ళంతా ఈనాడు అవినీతి మార్గంలో సాగమని తన నెందు కింతగా ప్రోత్సహిస్తున్నారు ? చెడులోవున్న ఆకర్షణే ఇది కాబోలు.

''ఏమిటెంత ఆలోచన, గోపాలం ? అతిగా ఆలోచిస్తే మన ప్రతి కదలికా తప్పుగానే తోస్తుంది, బ్రదర్ ! నువ్వొక శ్వాస కూడా తీసుకోలేవు ఊఁ అను. లేదా ఈ మౌనమే అంగీకార మనుకోమంటావా ?''

వెంకటేశం, భుజాలు పట్టుకు కుదుపుతున్నాడు.

నిజమే. ఎంతకాలం ఆలోచిస్తాడిలా తను ? ఎప్పటికి పరిష్కారం దొరుకుతుంది ?

''నీ ఇష్టం !''

పిచ్చిగా నవ్వుకుంటూ వెనుదిరిగాడు గోపాలరావు.

*     *     *     *

"కాఫీ తీసుకోండి."

తలెత్తి చూచాడు గోపాలరావు. ఎర్రగా, బూరల్లాటి బుగ్గలతో ఆంభీరులావుండే ఆనాటి వధువు లలితకూ, అస్థిపంజరంలావున్న ఈ లలితకూ పోలికలే లేవు.

"అమ్మ కెలావుంది ?" అన్నాడు దృష్టి మరలించుకుంటూ.

"జ్వరం రాలేదు. కానీ చాలా నీరసంగా వున్నారు. బత్తాయిపళ్ళరసం మందుతోబాటు మూడు పూటలా ఇమ్మన్నారు డాక్టరుగారు" అంది ఖాళీగ్లాసు తీసుకువెడుతూ.

"హుఁ! అమ్మకు బత్తాయిపళ్లు కావాలి. లలితకు మందు లిప్పించాలి. సూర్యాన్ని చదివించాలి...సుశీలకు పెళ్లి చెయ్యాలి. అప్పు తీర్చాలి. పిల్లల్ని పెంచి పెద్దవాళ్లని చెయ్యాలి...అబ్బ ఈ మధ్యతరగతి కుటుంబం. నీతి...ఆదర్శాలు...అబ్బ !" ఆలోచనలతో బుర్ర బద్దలుకొట్టుకుపోతూంది గోపాలరావుకు.

"స్నానానికి నీళ్లు పెట్టాను, రండి !" లోపలినుంచి పిలుపు వచ్చింది.

వెళుతూ వెళుతూ గదిలోకి తొంగిచూశాడు. సుశీల ఫైళ్ళన్నీ ముందు పడేసుకు వ్రాస్తూంది. ముఖమంతా చెమటలు

పట్టింది. జుట్టు రేగి, అణువణువునా అలసటా, విసుగూ, విరక్తీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పది సంవత్సరాల క్రితం, "దమ్మిడీ కట్నం పుచ్చుకోని ఆదర్శయువకుడయితే అతన్ని పెళ్ళాడతాను... లేదా, చక్కగా ఉద్యోగం చేస్తాను !" అన్న పదిహేడేళ్ళ సుశీలకూ, ఈనాడు అలాటి ఆదర్శయువకుడు రాక, పోకిరీ వెధవల కారుకూతలకూ, ప్రేమలేఖలకూ, శరీరమూ, హృదయమూ మండిపోతూంటే, యౌవనాన్నీ, కోర్కెలనూ అక్కడికక్కడే కాల్చివేస్తున్న ఇరవై యేళ్ళ సుశీలకూ ఎక్కడా పోలికలే లేవు.

ఛీ ! తనెంత బుద్ధి తక్కువ మనిషి ! సుశీల ఆడది. ఏ ఆడపిల్లయినా తనంత తానుగా, పెళ్ళి కావాలని కోరుతుందా ? తన కోర్కెను వెల్లడించుకుంటుందా ? కనీసం లలిత, అమ్మ పదేపదే హెచ్చరిస్తున్నా గ్రహించుకోగలిగాడా ?

"చూడండి, పాపం సుశీల ! ఒక్కర్తే పడుకుని ఇంత రాత్రివేళా ఏదో పుస్తకం చదువుకుంటూంది !" ఇంకా ఏదో చెప్పబోతున్న లలితను కసిరేవాడు తను.

"ఛస్ ! అదేదో మాంచి నవల చదువుకుంటూంది. దానికి పుస్తకాల మీదున్న ఆసక్తి అలాటిది"

అంతేగానీ, నిద్రపట్టక, చేసేదిలేకా, మదిలో రేగే కోర్కెల్ని బలవంతంగా కట్టిపెట్టేటందుకుగాను, అంత రాత్రి వేళా, పుస్తకాలతో గడుపుతూందని, ఊహించలేకపోయాడెందుకని ?

గుమ్మంలో అలికిడి విని తలెత్తి చూచి గాభరాపడింది సుశీల. "లోపలికిరా, అన్నయ్యా! ఈరోజు సెలవు పెట్టావా? ఆ ఫైళ్ళన్నీ అలాగే ఉన్నాయి కదా?" అంది ముఖాన్నీ, మెడనూ పమిటతో తుడుచుకుంటూ.

"మగవాణ్ణి! వెధవ ఫైళ్ళతో కుస్తీ పట్టేసరికి నాకే తలప్రాణం తోకకు వస్తోంది, సుశీ! వెధవ ఉద్యోగం మానేయ్!" ఒక నిర్ణయానికి వచ్చాడు గోపాలరావు.

"అన్నయ్యా! ఉద్యోగం మానేసి...?" ఆ కళ్ళల్లో ఏదో ప్రశ్న దాగివుంది. అది తనకు తెలుసు.

"ఫర్వాలేదులే అమ్మా! ముక్కు వున్నంతకాలం వుండే పడిశమే ఇది. ఆ నెల్లూరు సంబంధం ఖాయం చేద్దామనుకుంటున్నాను తల్లీ! నీ ఇష్టం కూడా కనుక్కుని మాట ఇద్దామని..."

"అన్నయ్యా!" మరు నిమిషంలోనే గోపాలరావు భుజంమీద వాలిపోయింది సుశీల. సజల జలదం శీతల వాయు స్పర్శకు వర్షించినట్లు ధారాపాతంగా కన్నీళ్లు గోపాలరావు భుజాన్ని తడిపివేస్తున్నాయి.

"పిచ్చితల్లి! నాకు తెలుసమ్మా నీ బాధ! మన సమాజం మనం అనుకున్నంత ప్రగతి సాధించలేదమ్మా. ఆడపిల్ల ఉద్యోగం చేస్తోందంటే, మనతో బుట్టువులాటిదేననే భావన ఇంకా పురుషులలో కలగటంలేదు తల్లీ! ఎలాగో ఓలా ఏడిపిద్దామనే దృక్పథంనుంచి వాళ్ళింకా బయటపడటంలేదు తల్లీ!

నీ పెళ్ళికోసం, కుటుంబ సమస్యలకోసం, నేను అవినీతికి పాల్పడుతున్నానని ఏడుస్తున్నావా ? పిచ్చిపిల్లా ! ఇదో విషవలయమమ్మా ! జీవితావసరాలు, ఆకాశాన్నంటుతున్న ధరలు, అధికారుల నిర్లక్ష్యం, నాయకుల అవినీతి, బ్లాక్ మార్కెట్టు— ఓహ్, అన్నీ సుడిగుండాలు. వీటిని సామాన్య మానవులు— మనబోటివాళ్ళు తప్పించుకుని ఉన్నతంగా బ్రతకగలగాలని కలలు కనడం పిచ్చిపని తల్లీ !''

ఇలా ఏమేమో చెప్పాలనీ, విడమరిచి స్పష్టం చెయ్యాలనీ గోపాలరావు హృదయం ఘోషిస్తోంది. కానీ పెదవులు మాత్రం విడివడలేదు. సుశీల తల, వీపు ఆప్యాయంగా నిమురుతున్న అతగాడి చెయ్యి భాషాతీతమైన భావాల్నీ, వాత్సల్యాన్నీ కురిపిస్తోంది.

''ఒరే గోపాలం ! ఇలా రా, నాయనా !'' పక్క గదిలోనుంచి తల్లి పిలుపు వినిపించటంతో తెప్పరిల్లారిద్దరూ.

''వస్తున్నానమ్మా !''

''ఒరే నాయనా ! నా గొంతులో ప్రాణంవుండగా దానికా మూడుముళ్ళూ పడేయించరా !'' టేప్ రికార్డర్‌లా మళ్ళీ పల్లించింది మహాలక్ష్మమ్మ.

రోజులా ''ఏమిటే నీ గోలా ?'' అని చిరాకుపడలేదు గోపాలరావు. ''అలాగే అమ్మా ! ఆ నెల్లూరు సంబంధం ఖాయం చెయ్యబోతున్నాను. సుశీలకూడా ఒప్పేసుకుంది. వరుడు ఎం. ఏ. లెక్చరర్ ! కట్నం ఐదువేలు...'' వివరాలు చెప్పాడు.

మహాలక్ష్మమ్మ ముఖంలో ఒక్క వెలుగు వెలిగింది క్షణ కాలం. మరునిమిషంలో ఆందోళనగా చూచింది. "అంత డబ్బు ఎక్కడ తెస్తావురా, నాయనా ?"

"అదంతా నే నెలాగో సర్దుబాటు చేసుకుంటాలే. నువ్వు స్తిమితంగా పడుకో !"

స్నానం చేస్తూ ఒకొక్క చెంబు నీళ్లూ నెత్తిన దిమ్మరించుకుంటున్నాడేగానీ, శరీరాన్నంతా తడుపుతున్నామో లేదో కూడా గమనించటంలేదు గోపాలరావు.

'నువ్వేం విలాసాలు కోరటంలేదు. కార్లూ, పికార్లూ, మేడలూ కావాలనటం లేదు. బ్రతుకు తెరువు కోరుతున్నావు. సమస్యల బరువునుంచి కాస్త ఊపిరి పీల్చుకోదలుచుకుంటున్నావు...అంతే !'

అంతరాత్మ ఘోషిస్తూంది. కళ్లు మూసుకునివున్న అతగాడి మనోనేత్రాలముందు, ఏవో చక్రాలు గిరగిర తిరుగుతున్నాయి. అవి వెదజల్లే విషవాయువుల సుడిగుండాలు ప్రపంచమంతా పరుచుకుంటున్నాయి. తమ చుట్టూరా తిరుగుతున్న ఆ వలయాలను దిగ్భ్రాంతితో చూస్తున్న వేలాది యువతీ యువకులు, మరి బయటపడే మార్గం లేక, వాటిలో దభీమని పడిపోతున్నారు. అలా పడినవారు ఇక లేవలేక పోతున్నారు. బాధతో గిలగిలలాడుతున్నవారు కొందరయితే, జల్సాగా కార్లు, మేడలు మొదలయిన భోగాలవేపు పరుగులు తీస్తూ మరో రకం వలయాల్లో చిక్కుకుపోతున్నారు మరి కొందరు.

పక్కింటి రేడియో పెద్దగా అరుస్తూంది. ఎవరో దేశ నాయకుడు కాబోలు గొంతు చించుకుంటున్నాడు. "అవినీతిని అరికట్టండి. నైతికంగా ఉన్నత మానవులుగా రూపొందండి. కట్నాల సమస్య అంత మొందించండి!"

అవును, అతగాడెవరో అదృష్టవంతుడు. అతడికి బహుశా సుశీలలాటి పెళ్ళిగాని చెల్లెలు వుండివుండదు. ఉన్నా, ఏ ఏభై వేలో అరవై వేలో కట్నంగా ఇచ్చి పెళ్లి చేసివుంటాడు. జీవితావసరాలు వెతుక్కోవలసిన దుర్భర పరిస్థితులు అతగాడికి ఉండివుండవు. ఉన్నా, అవన్నీ 'లంచం' పేరటగాక 'లాంఛనాలు', 'మర్యాదలు' ఆదిగాగల వాటి పేరట తన ఇంట్లో చేరుతూంటాయి. ఇంకేం? కారులో కాలు కింద పెట్టకుండా, బంగళాలో కూర్చుని, మైక్ బద్దలు కొడుతున్నాడు. శ్వాస తీసుకున్నంత తేలిగ్గా నీతులు వల్లిస్తున్నాడు.

పిచ్చిగా నవ్వుకుని ఇంట్లోకి వచ్చాడు గోపాలరావు.

*    *    *    *

"కట్నం అక్షరాలా అయిదు వేల రూపాయలు."

తళతళ మెరుస్తున్న వెండి పళ్లెంలో వరుడి ముందుంచాడు గోపాలరావు. సుతారంగా చేతితో తాకి, పక్కన పెట్టుకున్నాడు వరుడు.

సుశీల కళ్లెత్తి చూచింది...ఆ కళ్ళల్లో నీళ్లు లేవు. గోపాలరావూ సుశీల వేపు చూచాడు. ఇద్దరి కళ్ళూ క్షణకాలం

